క్లుప్తంగా

దూరవిద్య వాల్‌పోస్టర్ల విడుదల

పోరుమామిళ్ల : రెగ్యులర్ కోర్సుల్లో పది,ఇంటర్ పూర్తి చేయలేకపోయిన వారికి దూరవిద్య ద్వారా ఆ అవకాశం లభిస్తుందని జిల్లా ఓపెన్ స్కూల్ సమన్వయకర్త సాంబశివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులతో కలసి దూర విద్య వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం దూరవిద్యలో జిల్లా మొదటిస్థానంలో ఉందని, ఈ సంవత్సరం కూడా అలాగే కొనసాగాలన్నారు. పది, ఇంటర్ మధ్యలో మానేసిన విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంఓ విజయభాస్కరుడు, ఎంఈఓ కొండిశెట్టి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ పార్కులో ఏపీ బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. సంఘం పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి శీను మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టే మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోయే విధులను నిర్వహిస్తూ ప్రజాసేవలో తాము భాగస్వామ్యం కావాలని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మా హాస్పిటల్ అధినేత డాక్టర్ రాజేష్ కుమార్ సహకారంతో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సలహాలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.రమేష్ కుమార్, సంఘం ప్రధాన కార్యదర్శి జిల్లి అశోక్ కుమార్, ఆర్థిక కార్యదర్శి పల్లా రామారావు, వేల్పుల భాస్కర్ యాదవ్, మైదుకూరు ఎన్జీఓ అధ్యక్షులు జి.చంద్రమౌళి, డాక్టర్‌వంశీ, మహేశ్వరయ్య, వరప్రసాద్, వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

కాశినాయన : రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని బాలాయపల్లె గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందాయా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితేష్ రెడ్డి, టీడీపీ నాయకులు డి.కృష్ణారెడ్డి, రవీంద్రారెడ్డి, గురివిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్జీఓ ఎన్నికలు

మైదుకూరు : ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ మైదుకూరు తాలూకా కార్యవర్గం ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. తాలూకా అధ్యక్షుడుగా గజ్జల చంద్రమౌళి, కార్యదర్శిగా మాచనూరు రాఘవయ్య ఎన్నికయ్యారు. సహాధ్యక్షుడుగా అర్జున్, ఉపాధ్యక్షులుగా పెంచల్ రెడ్డి, రాజన్న, గురుప్రసాద్, మేరీ సుగుణ, కోశాధికారిగా లక్కినేని బాబు, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ వి.సుధా, పద్మావతి, మునయ్య, పీవీ రామగుప్త, తులశమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా ఎన్జీఓ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సహాయ ఎన్నికల అధికారిగా రాజశేఖర్, అబ్జర్వర్‌గా జిల్లా కార్యదర్శి డి.రవికుమార్ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు. జిల్లా సహాధ్యక్షుడు తిమ్మారెడ్డి, కోశాధికారి నిత్యపూజయ్య, పద్మనాభం, సదా శివయ్య ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆదిరెడ్డిపల్లెలో కొత్త పైపులైన్

మైదుకూరు : మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో పగిలిపోయిన తాగునీటి పైపులైన్ స్థానంలో కొత్త పైపులైన్ వేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో గ్రామంలోని తాగునీటి పైపులు పగిలిపోయి నీటి సరఫరా నిలిచిపోయిన విషయంపై ఆదివారం సాక్షిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ పగిలిపోయిన పైపుల స్థానంలో కొత్త పైపులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతానికి పాత బోరుకే పైపులను అనుసంధానం చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్ కుమార్‌రెడ్డి తెలిపారు. పైపులైన్ వేయడం పూర్తికాగానే సరఫరాను పునరుద్ధరిస్తామని ఏఈ పేర్కొన్నారు.

ఉచిత సర్టిఫికెట్ కోర్సు

మైదుకూరు : ఇంటర్మీడియట్ విద్యార్థులకు మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు వారాలపాటు ఉచిత సర్టిఫికెట్ కోర్సును అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహించే బ్రిడ్జ్ టు బ్రిలియన్స్ సర్టిఫికెట్ కోర్సు ద్వారా విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, అనలిటికల్ స్కిల్స్, కంప్యూటర్ ప్రాథమికాలు, జీవన నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.

మౌనశ్రీ మల్లిక్‌కు పురస్కారం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలోని కాలక్షేపం మండపంలో ఆదివారం పల్లా జాతీయ కవితా పరస్కారం –2025 ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కొమ్మిశెట్టి మోహన్, కొనిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ పల్లా కృష్ణ తన తండ్రి పేరు మీద ఈ పురస్కారాన్ని స్థాపించి 8 ఏళ్లుగా కవితా పురస్కారాన్ని అందిస్తున్నారన్నారు. సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు మాట్లాడుతూ మౌనిశ్రీ మల్లిక్‌కు ఈ పురస్కారం అందించడం హర్షణీయమన్నారు.

దారులు అధ్వానం.. ప్రయాణం నరకం

చాపాడు : కూటమి ప్రభుత్వం అధికారంలో రావడమే తడువు రాష్ట్రంలోని అన్ని దారులకు బాగు చేస్తాం.. ఒక్క సారి అవకాశం ఇచ్చి చూడండంటూ.. ఓ వైపు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక రోడ్లను బాగు చేయడం మరిచారు. చాపాడు మండలంలోని అయ్యవారిపల్లె, రాజువారిపేట పంచాయతీ పరిధిలో బీటీ రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. ఈ దారుల్లో ప్రయాణించాలంటే నరకం చూడాల్సిందేనని ఆ ప్రాంతపు ప్రజలు వాపోతున్నారు. చాపాడు నుంచి నక్కలదిన్నెకు వెళ్లే రోడ్డులో రాజువారిపేట టర్నింగ్ నుంచి పొలాల మీదుగా తిమ్మాయపల్లె, అయ్యవారిపల్లె, రామదాసుపురం గ్రామాలకు వెళ్లే 7 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు గుంతలు పడి రోడ్డు క్రింద కంకర పైకి వచ్చి అస్తవ్యస్తంగా మారింది. అడుగడుకు గుంతలే అన్నరీతిన రోడ్డు దెబ్బతినింది. ఇదే క్రమంలో అయ్యవారిపల్లె నుంచి ప్రొద్దుటూరు మండలం కల్లూరుకు వెళ్లే దారి 6 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు ధ్వంసమయింది. ఈ దారిలో ఎలాంటి వాహనాల్లో ఒక సారి వెళ్లితే రెండో సారి వెళ్లాలంటే బెంబెలెత్తిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ దారుల్లో వెళ్లాల్సి వస్తోందని ఆయా ప్రాంతాల రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించిన దెబ్బతిన్న రోడ్లను బాటు చేయాలని, వర్షాలు పడితే ఈ దారుల్లో ప్రయాణం అగమ్యగోచరంగా మారే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు.


కంకర రోడ్డుగా మారిన అయ్యవారిపల్లెకు వెళ్లే బీటీ రోడ్డు


రాజువారిపేట సమీపంలో గుంత పడ్డ రోడ్డులో ఇబ్బందికరంగా వెళుతున్న కారు


దారి పొడవునా గుంతలు పడిన అయ్యవారిపల్లె-కల్లూరు రోడ్డు దుస్థితి

రాష్ట్రంలో రాక్షస పాలన

- ప్రథమ పౌరురాలిని అవమానించిన టీడీపీ, జనసేన
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, మహిళలకు భద్రత కరవైందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మీడియాతో ఆదివారం ఆయన మాట్లాడుతూ మహిళలను గౌరవించడం భారత దేశ సంప్రదాయమని తెలిసి కూడా కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారికను టీడీపీ, జనసేన గుండాలు అవమానించడం దారుణమన్నారు. ఎక్కడ మహిళలను గౌవరవిస్తారో అక్కడ దేవుళ్లు విహరిస్తారని, ఆ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని వేదాలు చెబుతున్నాయన్నారు. పట్టపగలే నడిరోడ్డులో కారు ఆపి రాడ్లు, కర్రలతో దాడి చేయడంతో జెడ్పీ చైర్‌పర్సన్, ఆమె భర్త ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. అప్పులు చేయడం, అబద్ధాలు చెప్పడం, వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు చేయడం, అవమానపరచడం, కేసులు పెట్టి జైలుకు పంపడం అభివృద్ధి అనుకంటున్నారా? అంటూ ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎక్కడ మహిళలకు అవమానం జరిగినా, వారికి అదే చివరి రోజు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్న మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాజకీయాలకు విలువ ఇచ్చి మాజీ ముఖ్యమంత్రి జగన్ సంస్కారంతో వ్యవహరిస్తున్నారని, ఎంత కష్టమైనా, నష్టమైనా భరిస్తామని, చివరికి ప్రాణం ఇచ్చేందుకై నా కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సంఘటనపై వెంటనే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పెద్దలతో చర్చించి డీజీపీని కలిసి ఇలాంటి సంఘటనలు జరగకుండా ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కారుకు తాడు కట్టి ఎక్కడికి తీసుకెళ్లి, ఏమి చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. ఈ సంఘటనలు జరుగుతుంటే చేతులు కట్టుకుని ఉండలేమని, ఎక్కడైతే జెడ్పీ చైర్ పర్సన్ హారికకు అవమానం జరిగిందో వారికి రానున్న రోజుల్లో దండన తప్పదని అన్నారు. సంఘటన జరుగుతున్నా పోలీసులు చూస్తూ మిన్నకుండిపోయారని, రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలందరూ ఈ సంఘటనపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

యూరియా కొరతతో రైతుల అవస్థలు

గోపవరం/బ్రహ్మంగారిమఠం: మండల వ్యాప్తంగా పంటలు సాగు చేసిన రైతులు యూరియా కొరతతో నానా అవస్థలు పడుతున్నారు. యూరియా కోసం రైతుసేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అక్కడ సిబ్బంది కూడా లేకపోవడంతో సేవా కేంద్రాలు మూతపడి ఉన్నాయి. ప్రస్తుతం సజ్జ, పెసర, వివిధ పంటలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం సాగు చేసిన పంటలకు యూరియా అవసరం ఉంది. అయితే ఎక్కడా యూరియా దొరకకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట ఎదుగుదలకు యూరియా అవసరముంది. యూరియా అవసరం కావడంతో బద్వేలులోని ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. అక్కడా యూరియా కొరత ఉండటంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. రైతుసేవా కేంద్రాల్లో వేసిన పంటలకు ఎరువులు అందుబాటులో ఉంటాయని వ్యవసాయాధికారులు పదేపదే చెబుతున్నా అందుకు భిన్నంగా కేంద్రాలు మారాయి. గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు రైతులకు అన్నిరకాల ఎరువులు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండేవి. కార్యాలయాలకు ఎప్పుడు వెళ్లినా మూతపడి ఉండటంతో సంబంధిత అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రహ్మంగారిమఠంలో నెల రోజులుగా యూరియా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వ్యాపారులు యూరియా అమ్మాలంటే ముందుకు రావడంలేదు. డీసీఎంఎస్ లోకూడా ఇదే పద్ధతి అమలు పరుస్తున్నారు. ఒక రైతుకు బస్తా యూరియా కావాలంటే పొటాషియం బస్తా కొంటే యూరియా ఇస్తామంటున్నారు. మార్కెఫెడ్‌లో యూరియా ఉన్నా అందడం లేదు.

విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాం

రాజుపాళెం: మండలంలోని వెల్లాల అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లను సిబ్బందే తొలగించారని పాఠశాల ప్రిన్సిపల్ తులశమ్మ తెలిపారు. తన పాఠశాలలో విలేకరులతో ఆదివారం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల తెరిచిన తర్వాతే ఆ చెట్లు తొలగించారన్నారు. లేబర్ ఛార్జీలు, మిగతా డబ్బు పాఠశాల అకౌంట్‌లో వేశామన్నారు. క్వార్టర్స్‌లో ఉండి స్వయానా నేనే ఈ పనులను పర్యవేక్షిస్తున్నానని, దానికిగానూ హౌస్ రెంట్, అలవెన్స్ నెలకు రూ.11 వేలు కడుతున్నానని చెప్పారు. సీట్లకు డబ్బులు వసూలు చేస్తున్నారనే మాట అవాస్తవమని అన్నారు. ఎటువంటి విచారణకైనా తాను సిద్ధమన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవర ఉత్సవాలు


దేవర ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, పార్టీ నాయకులు

పోరుమామిళ్ల : మండలంలోని మూడు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన దేవర ఉత్సవాల్లో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని రౌతుపల్లెలో, పట్టణంలోని మూలవీధి, యరసాల గ్రామంలో నూతన ఆలయాల్లో శ్రీ సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ట జరిగి 41 రోజులైన సందర్భంగా జరిగిన దేవర ఉత్సవాలలో ఆయన హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు ఎమ్మెల్సీ బృందానికి బాణసంచా, తప్పెట్లు, బ్యాండు మేళాలతో సాదర స్వాగతం పలికారు. పోరుమామిళ్ల మూలవీధి దేవర ఉత్సవంలో స్వామి శివరామానంద సరస్వతి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డిలు పాల్గొన్నారు. నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తొమ్మిది మంది పోలీసు సిబ్బంది బదిలీ

చాపాడు : స్థానిక పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న తొమ్మిది మంది పోలీసు సిబ్బంది బదిలీ అయినట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ఏఎస్‌ఐ గురుప్రసాద్ ప్రొద్దుటూరు టూ టౌన్, హెడ్ కానిస్టేబుల్ బాలయ్య తాళ్ల ప్రొద్దుటూరు, పీసీలు రాఘవరెడ్డి కడప వన్ టౌన్, సాంబశివుడు పెండ్లిమర్రి, మధుసూదన్‌రెడ్డి ప్రొద్దుటూరు టూ టౌన్, గురువాణి త్రీ టౌన్, గురుమునిస్వామి కడప ఉమెన్స్, ఇర్ఫాన్ అలీ బద్వేలు అర్బన్, బాలనరసింహులు ముద్దనూరు పోలీసు స్టేషన్‌లకు బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ఎస్‌ఐ చెప్పారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

బద్వేలు అర్బన్ : ఇటీవల మనం ఫౌండేషన్ ద్వారా డాక్టరేట్‌లు, జాతీయ సేవారత్న అవార్డులు అందుకున్న పలువురు అవార్డు గ్రహీతలను ఆదివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. డాక్టరేట్ అవార్డులు అందుకున్న బి.గురుమూర్తి, కొండపల్లిచిన్నసుబ్బారావు, జాతీయ సేవారత్న అవార్డులు అందుకున్న ఎస్.ఎన్.సుబ్బరాయుడు, వెంకటరమణ యాదవ్‌లను మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి, శ్రీరామరాజు ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ పేర్నిపాటి శ్రీరామరాజు తదితరులు శాలువా, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ బి.వెంకటరాజు, మరాఠా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు బి.ఎం.కె.సాగర్, విశ్రాంత తెలుగు పండితులు పుల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలన ప్రజాస్వామ్యం ఖూనీ

- జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి దుర్మార్గం
- వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులతో వేధింపులు
- కూటమి అరాచక పాలనపై మండిపడ్డ ఎమ్మెల్సీ డీసీ గోవింద్‌రెడ్డి



అట్లూరు : కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని బద్వేలు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. పోరుమామిళ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై దాడులు అధికమవుతున్నాయన్నారు. అందుకు నిదర్శనం గుడివాడలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై జరిగిన దాడి ఈ దుర్మార్గ పాలనకు నిదర్శనమన్నారు. ఇది అధికార దుర్వినియోగం మాత్రమే కాదు ప్రజాస్వామ్యంపై చేసిన దాడి అని పేర్కొన్నారు. మహిళ అనే కాకుండా ఆమె హోదాకు గౌరవించకుండా అధికారిక కార్యక్రమానికి వెళుతున్న నాయకురాలిని హౌస్ అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. ఇవన్నీ కూటమి పాలన పతనానికి నాంది అవుతాయన్నారు. అలాగే అనంతపురం జిల్లా తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని హైకోర్టు ఆదేశాలు ఉన్నా ఇంటికి వెళ్లనీయకుండా అడ్డుకోవడం, నెల్లూరులో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి చేసి బాధితుడి పైనే కేసు పెట్టడం ఇవన్నీ పోలీసులను రాజకీయ బానిసలుగా మార్చిన తీరును స్పష్టం చేస్తున్నాయన్నారు. కేవలం వైఎస్సార్ శ్రేణులపైనే కాకుండా జర్నలిస్టులపైన కూడా ఈ దురుసు కొనసాగుతుందన్నారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసుపై పెట్టిన కేసు ఇందుకు దర్పం పడుతుందన్నారు. అలాగే గ్రామ మండల స్థాయి నాయకులపైనా సోషల్ మీడియా పైనా వందల సంఖ్యలో పెట్టిన తప్పుడు కేసులు అక్రమ అరెస్టులు బెదిరింపులను ప్రజలు గమనిస్తూ ఉన్నారన్నారు. కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మహానటుడు ‘కోట’కు శ్రద్ధాంజలి

ప్రొద్దుటూరు : మహానటుడు కోట శ్రీనివాసరావుకు తెలుగు భాషా పడింతుడు, కళారత్న డాక్టర్ మూలె రామమునిరెడ్డి ఆదివారం శ్రద్ధాంజలి ఘటించారు. హాస్యనటరత్న కోట శ్రీనివాసరావు మరణం తెలుగు జాతిని శోకసంద్రంలో ముంచిందని ఆయన పేర్కొన్నారు. ఆయన నవరస నటనా సార్వభౌముడై, నిత్యం నవ్వుల జడివానలో ముంచెత్తాడని తెలిపారు. 2011 జూలై 2, 3, 4 తేదీలలో ఉత్తర అమెరికాలో జరిగిన తెలుగు మహాసభల సంబరాలలో ఆయనతో కలిసి తాను పాల్గొనని గుర్తు చేసుకున్నారు. ఆయనతో పంచుకున్న ఆనందానికి మరణం లేదని, ఆ సంబరాలకు గుర్తు కోట శ్రీనివాసరావు సంతకం చూపారు.

కోటా శ్రీనివాసరావు మృతి తీరని లోటు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రముఖ నటుడు కోటా శ్రీనివాసరావు మృతి సినీరంగానికి తీరని లోటని రచయిత జింకా సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన 750కి పైగా చిత్రాల్లో నటించి 9 నంది అవార్డులు పొందారని, శాసనసభ్యుడిగా సేవలందించారని జింకా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారం అందించి సత్కరించిందన్నారు. 1999లో ప్రొద్దుటూరులో జరిగిన సర్దార్‌జీ ఫ్రెండ్స్ అండ్ ఆర్ట్స్ వార్షికోత్సవ సభలో ఆయన తనకు సాహితీ సేవా రత్న అవార్డును అందించారని గుర్తుచేసుకున్నారు. కోటా శ్రీనివాసరావు మరణం తీరని లోటు అని పేర్కొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు అర్బన్ : బద్వేలులో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరగబోవు సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి పి.నాగరాజు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా ఆదివారం పట్టణంలో గడప, గడపకు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 డిసెంబర్ 26 నాటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని శత జయంతి ఉత్సవాలు నిర్వహించుకోబోతున్న సీపీఐ పార్టీ నాటి నుంచి నేటి వరకు కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందని అన్నారు. ఇదే సమయంలో పాలక ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు పోరాటాలు చేపడతామని తెలిపారు. మహాసభల్లో భాగంగా 22వ తేదీన ర్యాలీ, బహిరంగ సభ, 23వ తేదీన ప్రతినిధుల మహాసభ జరుగుతాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యవర్గ సభ్యులు నాగసుబ్బయ్య, పట్టణ నాయకులు వెంకటేష్, సుబ్బయ్య, రమాదేవి, సుభాషిణి, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రొద్దుటూరు : తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ నీటి సరఫరా సిబ్బంది, లైటింగ్ వర్కర్లు, ఇంజనీరింగ్ సెక్షన్ వర్కర్లు విధులు బహిష్కరించి ఆదివారం నుంచి సమ్మె చేస్తున్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు విజయ్‌కుమార్, గంగాధర్‌రెడ్డి, రాఘవ, భాస్కర్ మట్లాడుతూ నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ సెక్షన్ వర్కర్లు, నాన్ పీహెచ్ వర్కర్ల వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో నిరసనలు తెలిపామన్నారు. ఈ నెల 4న చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా సీఎంను కలిసినప్పుడు జీతాల పెంపు విషయమై సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలో జరగబోవు క్యాబినెట్ మీటింగ్‌లో ఈ అంశంపై చర్చిస్తారని తెలిపినా.. ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు మరోసారి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషా, పట్టణాధ్యక్షుడు గోసంగి వెంకటసుబ్బారెడ్డి వారికి మద్దతు తెలిపారు. కార్మికులకు రూ.26వేల వేతనం పెంచాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఇర్ఫాన్‌బాషా డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ నాయకులు ఇన్‌చార్జి కమిషనర్, మున్సిపల్ ఇంజినీర్ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బకాయిలను చెల్లించాలని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకటజనార్దన్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఏపీసీపీఎస్ఈఏ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న డీఏ, ఈ ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న 2 డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2023 మే నుంచి ఇప్పటి వరకు పెట్టిన సరెండర్ లీవులు జమ కాలేదని, సీపీఎస్ ఉద్యోగులకు గత పీఆర్సీ నుంచి డీఏ బకాయిల అరియర్స్ ఇప్పటి వరకు ప్రాన్ ఖాతాకు జమ చేయలేదన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన గ్రాట్యూటీ, కమ్యూటేషన్లు జమకాలేదన్నారు. కొత్త పీఆర్సీ ఊసేలేదని, పాత పెన్షన్ అమలు జాడ లేదన్నారు. కనీసం మధ్యంతర భృతి లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఆవేదనలో ఉన్నారన్నారు. కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలన్నారు. చింతంరెడ్డి మాధవరెడ్డి, మహమ్మద్ రిజ్వాన్ ఆలీ, సానం ఈశ్వర్ రెడ్డి, పరమేశ్వర, మస్తాన్ వల్లి, నాగేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు పెంచాలి

ప్రొద్దుటూరు కల్చరల్: బీసీ సంక్షేమ హాస్టళ్ల మెస్ చార్జీలను ప్రభుత్వం పెంచాలని ఓబీసీ విద్యార్థి సంఘం పట్టణ అధ్యక్షుడు నరేష్ తెలిపారు. స్థానిక బీసీ కళాశాల వసతి గృహంలో ఆదివారం ఆకలి కేకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లోని ఒక విద్యార్థికి ఆహారం కోసం రోజుకు రూ.35 చెల్లిస్తున్నారని, ఇది ఏమాత్రం సరిపోదన్నారు. హాస్టళ్లలో సరైన సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థులు చదువుకోవడానికి ముందుకు వస్తారన్నారు. మెస్ చార్జీలను పెంచి, హాస్టళ్లను అభివృద్ధి చేయాలని కోరారు.


రీకాల్ చంద్రబాబు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి


ఖాజీపేట : ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన వ్యక్తి సీఎం చంద్రబాబు నాయుడని వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి అన్నారు. ఖాజీపేటలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రీకాల్ చంద్రబాబు కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులను కోరారు. కార్యక్రమం అంజనేయకొట్టాలు గ్రామంకు వెళ్లే రహదారిలోని జీఏ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పాల్గొంటారన్నారు.

బీసీలు రిజర్వేషన్ల కోసం పోరాటం చేయాలి

ప్రొద్దుటూరు : బీసీలు రిజర్వేషన్ల కోసం పోరాటం చేయాలని ఏపీ పెన్షనర్స్, ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ మాదాసు రంగనాయకులు తెలిపారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం పెన్షనర్స్, ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాసు రంగనాయకులు మాట్లాడుతూ బీసీలు ఐక్యత్యంతో ముందుకు పోవాలని తెలిపారు. తెలంగాణలో బీసీలు చైతన్యవంతులై లోకల్ బాడీ ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధించారన్నారు. దేశంలో రిజర్వేషన్ పొందే అర్హత లేని సామాజిక వర్గాలకు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ద్వారా పెద్దపీట వేశారని, దీని వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో విజయవాడలో జరగనున్న బీసీ మహాసభకు బీసీలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వెంకటకృష్ణయ్య యాదవ్, కేవీ చెన్నయ్య, వెంకటరాముడు, భాస్కర్‌రావు, మాచర్ల గౌడ్, లక్ష్మీనారాయణ, మాదాసు మురళి, దేవానంద్ పాల్గొన్నారు.

నియోజకవర్గ ఎన్నిక ఏకగ్రీవం


పోతిరెడ్డి భాస్కర్


షావల్లి


మైదుకూరు : సీపీఐ మైదుకూరు నియోజకవర్గ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శ్రీరాములు తెలిపారు. మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శిగా పోతిరెడ్డి భాస్కర్, సహాయ కార్యదర్శిగా ఎస్.షావల్లిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే 40 మంది నియోజకవర్గ కౌన్సిలర్లను, 19 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు. వీరి ఎన్నిక పట్ల ఏఐటీయూసీ మైదుకూరు నియోజకవర్గం కార్యదర్శి ఏవీ శివారం, సీపీఐ మైదుకూరు పట్టణ కార్యదర్శి డి.సుబ్బరాయుడు, బి.మఠం మండల కార్యదర్శి పి.ప్రభాకర్, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు బీవీ శ్రీనివాసులు, బి.పీరయ్య, ఎస్.రంతుల్లా, పి.పవన్, కె.రామాంజనేయులు, ఎస్.బాలసుబ్బయ్య, బీవీ బాలజీ, దువ్వూరు రవి, నారాయణ, రవి, కె.జయరాజు, పీవీ రమణమ్మ, సీపీఐ నాయకులు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 1986–87లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాలలో చదువుకుని దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఈ వేడుకలో పాల్గొన్నారు. తమ చిన్న నాటి జ్ఞాపకాలు, అల్లర్లను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల గొప్పతనాన్ని కొనియాడారు. కడప ఉప విద్యాశాధికారి జి.రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఆనాటి గురువులు బషీర్ అహ్మద్, నారాయణరెడ్డి, నాగరత్నమ్మ, వెంకటేశ్వరరెడ్డి, గుర్రప్ప, విశ్రాంత పీఈటీ నడిగడ్డ సుధాకర్, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు గీతలను ఈ సందర్భంగా వారు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో వైరింగ్ బాగు చేయిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు బసిరెడ్డి రమణారెడ్డి, సుబ్బయ్య, బాలాజీ సింగ్, సురేంద్ర, రమేష్, మల్లి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో 1986-87 పదో తరగతి విద్యార్థులు

సీఎస్ఐ చర్చి ఎన్నికల్లో ఇగ్నైట్ ప్యానెల్ విజయం


సీఎస్ఐ చర్చి ఎన్నికల్లో గెలుపొందిన ఇగ్నైట్ ప్యానెల్ సభ్యులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని సీఎస్ఐ సెయింట్ పాల్స్ టౌన్ చర్చిలో శనివారం జరిగిన పాస్టేట్ కమిటీ ఎన్నికలలో ఇగ్నైట్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ ఎన్నికలలో జనరల్ విభాగం నుండి ఇమ్మరాజు విలియం బెనహర్, నాగదాసరి చెన్నరాయుడు, పెద్దీటి రవిసుధాకర్‌బాబు, అల్లూరి సుధాకర్, స్త్రీల విభాగం నుం,ఇ అంగా మేరిజయశీల, యూత్ విభాగం నుంచి తంబకూరి రాజా లారెన్స్ గెలుపొందారు. ఈ ఎన్నికలలో ఒకే ప్యానల్ నుంచి అరుగురు ఎన్నిక కావడం విశేషం. 320 మంది ఓటర్లు ఉన్న ఈ ఎన్నికలలో 312 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఇటీవలే జరిగిన స్త్రీల మైత్రి ఎన్నికలలో సైతం ప్రస్తుతం గెలుపొందిన ప్యానల్‌కు చెందిన వీరదాసరి వసుంధర పాల్ గెలుపొందారు. ఈ సందర్భంగా గెలుపొందిన ప్యానల్ సభ్యులు మాట్లాడుతూ రాబోయే మూడేళ్ల కాలంలో సంఘ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల అధికారిగా బద్వేలు సీఎస్ఐ సెయింట్ పాల్స్ టౌన్ చర్చి డీనరీ చైర్మన్ రెవ. వేల్పుల ప్రసాద్‌బాబు వ్యవహరించగా, పరిశీలకులుగా దక్షిణ ఇండియా సంఘం నంద్యాల అధ్యక్ష ఖండ వైస్ ప్రెసిడెంట్ రెవ. పి.ఎ.వరప్రసాద్, ఎన్నికల అధికారులుగా సీహెచ్.రవికుమార్, పి.అనిల్‌పాల్ చక్రవర్తి, ప్రెస్బిటర్ రెవ.జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అర్బన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.